
# అమెరి'కులాసా' కథలు
## – వంగూరి చిట్టెన్‌రాజు



## – 17 –

## అమెరికాఖరి రోజుల కథ –ఒకటి

**ఇలాంటి కథ కాని కథ** రాయొచ్చో రాయకూడదో తెలీదు కానీ .....

మొన్న ఏప్రిల్ నెలలో నా పుట్టిన రోజుకి ముఖ పుస్తకం వారి ధర్మమా అని ప్రపంచ వ్యాప్తంగా వందలాది నాకు అభినందనలు, శుభాకాంక్షలు చెప్పారు. కొంత మంది "హేపీ రిటర్న్స్ ఆఫ్ ది డే" అని తమాషా బొమ్మలతో సందేశాలు పంపించారు కానీ పుట్టిన రోజు కి ఎవరు, ఎవరికి ఏమిటి వెనక్కి పంపిస్తున్నారో నా ప్రాణాలకి ఎప్పుడూ అర్థం ఆవలేదు. అంచేత గూగుల్ వారిని అడిగితే అప్పుడు తెలిసింది. ఈ మాట మొదటి సారిగా 1789 లో ఇంగ్లండ్ లో లేడీ న్యూడిగేట్ అనే ఆవిడ మొగుడికి తమ పెళ్లి రోజున "ఇలాంటి రోజులు మరిన్ని తిరిగి రావాలి" అని వ్రాసిందిట. అంటే మళ్ళీ మళ్ళీ పెళ్లి చేసుకోవాలి అని ఆవిడ కోరిక ఏమో తెలీదు కానీ అలాంటి శుభ ప్రదమైన రోజులు రావాలి అని కోరడానికి అది పర్యాయపదంగా మారింది. ఇది ఇంగ్లీష్ వాళ్ళు, భారతీయులే ఎక్కువ వాడతారు. ఎందుకో తెలీదు కానీ అమెరికా వాళ్లకి హాయిగా హేపీ బర్త్ డే లేక హేపీ వెడ్డింగ్ డే అని తినగా చెప్పెయ్యడమే కానీ ఇలాంటి డొంకతిరుగుడు అలవాటు లేదు. నిజానికి అమెరికా వాళ్ళకే కదా చాలా పెళ్లిళ్ళ రోజులు వస్తాయి. లేదా పెళ్ళిళ్ళ రోజులు చాలా వస్తాయి.

ఏమైతేనేం, పాపం కష్టపడి, ఇష్టపడి గ్రీటింగ్స్ పంపించారు కదా అని నేను వీటన్నింటికీ ధన్యవాదాలు, లైకు లు పెడుతూ ఉంటే వాటిల్లో ఒకానొక గ్రీటింగ్ కి నేను ఆశ్చర్య పడి, ఆనందపడి, తన్మయత్వంతో మా 70 అంగుళాల టెలివిజన్ పెట్టేసి రిమోట్ తో ఆ ఛానెల్ తెగ వెతకడం మొదలు పెట్టాను. సరిగ్గా ఈ తతంగం జరుగుతున్నప్పుడే మా క్వీన్ విక్టోరియా రంగ ప్రవేశం చేసి నా హడావుడి చూసి "ఏమిటి మొగుడూ, టీవీలో అంత వెతికేస్తున్నావ్ మళ్ళీ కెన్నెడీ హత్య కేసు గురించి ఏమన్నా వస్తోందా?" అని అడిగింది.




"కాదోయ్ ప్రేయసీ. ఇప్పుడే అందిన తాజా వార్త. ఘనత వహించిన సి.ఎన్.ఎన్. వారు టీవీలో నాకు పుట్టిన రోజు గ్రీటింగ్స్ చెప్పారుట. అది చూద్దామని వెతుకుతున్నాను" అన్నాను.

"సి.ఎన్. ఎన్నా...అంటే ఏండర్సన్ కూపర్, వుల్ఫ్

బ్లిట్జర్ ..ఆ గేంగ్ వాళ్ళు నీ పుట్టిన రోజుకి గ్రీటింగ్స్ చెప్పరా? వాళ్ళు ట్రంప్ గాడి పుట్టిన రోజునే పక్కన పెట్టేస్తారు కదా...మధ్యలో కోన్ కిస్కా గాడివి నువ్వేమిటి? ఎవరు చెప్పారు?" నిలదీసింది మహారాణి.

"కావాలంటే ఇదిగో చూడు. ఓ స్నేహితుడు స్క్రీన్ షాట్ పంపించాడు." అని నాకు ముఖ పుస్తకంలో వచ్చిన ఆ మెసేజ్ చూపించాను." గర్వంగా.

అది చూసి ఒక క్షణం బిత్తరపోయి, మరుక్షణం పడీ, పడీ అందంగా నవ్వేసి, అడ్డంగా తల ఊపేసి, మామూలు కంటే ఘాట్టిగా టెంకి జెల్ల కొట్టేసి ఉద్యోగానికి కి పారిపోయింది మా క్వీన్ విక్టోరియా. ఏమిటీ వైపరీత్యం అనుకుంటూ ఉండగా "నువ్వు ఒట్టి వెర్రి బాగుల వాడివోయ్ హస్బెండూ. సి.ఎన్.ఎన్ అంతా ఫేక్ న్యూస్ అని ట్రంప్ చెప్పటల్లేదా?...మెనీ హేపీ రిటర్న్స్ ఆఫ్ ది డే. సారీ ఇందాకా చచ్చేటట్టు నవ్వొచ్చి మర్చిపోయాను చెప్పడం" అని నా సెల్ ఫోన్ లో ఒక చిన్న మెసేజ్ పెట్టింది మా మహారాణి. "హారినీ" అనుకుని, నాలిక్కరిచేసుకుని, ఆ ఫేక్ ఫోటో పెట్టి నన్ను మభ్యపెట్టిన ఇస్మాయిల్ పెనుకొండ అనే ఆ మిత్రుడి ఆప్యాయతకి ధన్యవాదాలు పంపించాను.

ఆ విధంగా నా 876వ నెల వారీ పుట్టిన రోజు ఆర్భాటంగా జరుపుకుని ఆ మర్నాడే మా హ్యూస్టన్ లో జరిగిన HATS సంస్థ వారి సమావేశానికి మొట్ట మొదటి సారిగా వెళ్లాను. HATS అంటే Houston Association of Telugu Seniors. అసలు ఏం జరిగింది అంటే ..సుమారు ఐదేళ్ళ క్రితం ఒక పెద్దావిడ ఆధ్వర్యంలో వారి కుటుంబం, మరి కొందరు రిటైర్ అయిన సీనియర్ సన్నిహితులూ కాలక్షేపానికి నెలకి ఒక రోజు మధ్యాహ్నం ఏదో ఒక రెస్టారెంట్ లో కలుసుకుని కబుర్లు చెప్పుకోడం మొదలు పెట్టారు. క్రమంగా అది విస్తరించి 30 సీనియర్ కుటుంబాలకి పైగా రావడం, సీనియర్ సమస్యలు చర్చించు కోవడం, వాటి మీద నిష్ణాతులని పిలిచి ప్రసంగాలు ఏర్పాటు చేసుకోవడం జరుగుతూ చాలా ఉపయోగకరంగా ఉంటున్నాయి. అంచేత ఈ సమావేశాలని నిబద్ధతతో నిర్వహించడానికి ఏడాది కిందట HATS పేరిట ఒక అధికారిక సంఘం ఏర్పాటు చేసుకుని దానికి ఒక అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారి, సలహామండలి ఎన్నుకున్నారు. నేను ఇప్పటి దాకా వీరి సమావేశాలకి వెళ్లకపోవడానికి ఒక కారణం మీరు ఊహించ గలిగినదే. అనగా.....స్టెప్పులు వెయ్య లేకపోయినా నా వయసు ఇంకా పదహారేళ్ళే అనుకునే అపోహ నాది. పైగా నాకు కాలక్షేపానికి లోటు లేదు. ఆ మాటకొస్తే ఉన్న సమయమే చాలదు. మా ఊళ్లో సుమారు 70 మంది సీనియర్ కుటుంబాలు ఉన్నారు...ఇంచు మించు అందరూ నాకు తెలిసిన వారే. అందులో నాలాగా 1970 లలో వచ్చిన కుటుంబాలు సుమారు 15 ఉంటాయి. వచ్చిన వాళ్ళలో కొందరు టోపీలు పెట్టుకున్నారు కానీ ఎవరికీ పెట్టేవాళ్ళు కాదు.

ఈ సమావేశానికి మొదటిసారి వెళ్లాను కాబట్టి అంత మంది పాత స్నేహితులని ఒక చోట చూడడం బాగానే ఉంది కానీ నా వయసు కూడా పెరిగిపోయిందేమో అని కాస్త బెంగ వచ్చి ఇబ్బంది పడిపోయాను. ఎందుకంటే "అమెరికాలో నువ్వు తిరిగే వాళ్ళ వయసుతో నీ వయసు సమానం" అనే ఒక సామెత ఉంది. అందుకే నేను కుర్రకారుతో ఎక్కువ చనువుగా ఉంటాను. ఇక నేను హ్యూస్టన్ లో అడుగు పెట్టినప్పటినుంచీ ఆప్తుడైన అధ్యక్షుల వారి ఉపన్యాసంతో సభ ప్రారంభం అయింది. ఈ నాటి ప్రత్యేక వక్త...ఆ వీధిలోనే ఉన్న ఒకానొక దహన గృహం తాలూకు వ్యక్తి. దహన గృహం అంటే ఫ్యూనరల్ హోమ్ కి నా తెలుగు పదం అనమాట. అదే గూగుల్ వారిని అడిగితే శ్మశానం ఇల్లు అన్నారు. ఏమిటో ఇలాంటి తెలుగు పదాలు అన్నీ నా మొహంలా ఉన్నాయి కానీ ఏం చేస్తాం. ఎప్పుడో అప్పుడు వాడక తప్పదు.

ఆ నాటి శ్మశాన వీరుడు ..అంటే ఆ అంశం మీద ప్రసంగించిన తెల్ల దొర .. ఎవరైనా సరే గుటుక్కుమనేశాక బొత్తిగా కుదరదు కాబట్టి ముందే తగిన ఏర్పాట్లు ..అంటే దహన క్రియ లేదా సమాధి చేయించుకొనుట, దానికి ముందూ, తరువాతా కావలసిన న్యాయ పత్రాలు, ముఖ్యంగా వీటన్నింటికీ అయ్యే తడిపి మోపెడు ఖర్చుకి ఇప్పుడే ఇన్స్యూరెన్స్ తీసుకుంటే వచ్చే లాభాలు వగైర్రా విషయాల మీద స్లైడ్స్ వేస్తూ సమగ్రమైన ఉపన్యాసం ఇచ్చాడు. వాడూ, కూడా వచ్చిన సుందరాంగీ కూడా సుమారు యాభై భావి వినియోగదారులైన మమ్మల్ని ఒకే చోట కలుసుకోవడంతో లోలోపల కొంచెం సంతోషంగానే ఉన్నా, ఎప్పుడో పోయిన గాంధీగారి గురించి తప్ప ఇప్పుడు బతికున్న భారతీయుల

గురించి పాపం ఎక్కువ తెలిసినట్టు లేదు. అంచేత ఇలాంటి మీటింగులలో వాడు యాదాలాపంగా అందరినీ ముందుగా అడిగే ప్రశ్న వెయ్యగానే ఖంగు తిని, తరువాత మా వాళ్ళ ప్రశ్నలు కొన్నింటికి భంగు తిన్నారు పాపం.

అతగాడు మమ్మల్ని అడిగిన మొదటి ప్రశ్న "మీలో ఐదేళ్ళకి పైగా పెళ్లి అయిన వాళ్ళు ఎంత మంది?" అది వినగానే అందరూ గొల్లుమని నవ్వు ఆపు కోలేక పోయారు. ఎందుకంటే అమెరికా వాడి లెక్క ప్రకారం ఏకంగా ఐదేళ్ళు విడాకులు లేకుండా ఉండడం ఎంతో ఘన విజయం కాబట్టి అదే అడిగాడు ఎప్పటిలాగానే. కానీ అక్కడ ఉన్న భారతీయులందరూ కనీసం పాతికేళ్ళగా ఒకళ్ళతోటే కాపురం చేస్తున్నారూ అని వాడికి అర్థం అయి వాడి తెల్ల నాలిక్కరుచుకున్నాడు. ఇక యాభై, అరవై ఏళ్ళ వార్షికోత్సవాలు చేసుకున్న వాళ్ళు కూడా ఉన్నారు అని తెలియగానే వాడి గుండె ఆగిపోతుందేమో అని భయం వేసి, "నీకు శ్మశానం ఇన్స్యూరెన్స్ ఉందా?" అని నేను అడగ్గానే పాపం వెర్రి నవ్వు నవ్వాడు. ఆ మాట కొస్తే అక్కడ ఉన్న వాళ్ళ సంతానంలో కొందరికే పెళ్లి అయి పదేళ్ళు దాటిన వాళ్ళు ఉన్నారు.

ఇక మన వాళ్ళు వేసిన ప్రశ్నలకి వాడి కంప్యూటర్ లో సమాధానాలు లేవు సరి కదా, ఏం చెప్తే ఎక్కడ సొంత చావు ముంచుకొస్తుందో అని హడిలి పోయాడు. ఉదాహరణకి ఒకావిడ "మా ఇండియాలో గంధం చెక్కలూ అవీ వేసి దహనం చేస్తారు. ఇక్కడ అవి దొరుకుతాయా?" అనగానే అసలే తెల్లగా ఉన్న మొహం ఎర్రగా కందిపోయి "మాకవేం తెలీదు. మిమ్మల్ని...సారీ , మిమ్మల్ని అంటే మిమ్మల్ని కాదు...ఏ శరీరాన్ని అయినా ఓ కర్ర పెట్టెలో పడుకో పెడతాం. కావాలంటే మీ గంధపు చెక్కలో, ఏమి కావాలంటే అవి నాలుగు అందులో వేసుకోండి." అన్నాడు. మరొకాయన "మేము ఐదేళ్ళ లో పైకి ప్రయాణం కట్టడానికి సిద్ధమై అప్పుడు ఖర్చులకీ ఇన్స్యూరెన్స్ తీసుకుని, తీరా ఇంకా గుండ్రాయిలా బతికుంటే మేము కట్టిన డబ్బు మాకు తిరిగి ఇచ్చేస్తారా?" అని అడిగాడు. దానికి వాడు తెలివిగా "మాట తప్పినది మీరు. దానికి డబ్బు మేం ఎందుకు ఇవ్వాలి?" అని ఎదురు ప్రశ్న వేశాడు. మరొకాయన "మేం ఇక్కడ బీమా తీసుకుని, తీరా మా బంధువులని చూడడానికి ఇండియా వెళ్ళినప్పుడు అక్కడ పైకి వెళ్ళే టిక్కెట్టు వచ్చేస్తే డబ్బు రూపాయాల్లో ఇస్తారా లేక ఇక్కడికి తీసుకొస్తారా?" అని బెంగగా అడిగాడు. "మీకు ఎలాగా రిటర్న్ టికెట్ ఉంటుందిగా. నెల లోపుగా వెంటనే వెనక్కి వచ్చేస్తే ఇక్కడ మా కాంట్రాక్ట్ ప్రకారం అన్ని ఏర్పాట్లూ చేస్తాం" అని అతని సమాధానం. ఈ సమాధానాన్ని బట్టి అతనికి ఆ ప్రశ్న అర్థం అవలేదు లేదా పరాయి దేశాలలో పార్థివ శరీరాల సంగతి బొత్తిగా తెలియదు అనీ నాకు అర్థం అయిపోయింది.

ఇక అసలు ప్రశ్న – సిసలు జవాబు. దీని నేపథ్యం ఏమిటంటే ఈ మధ్య మా ఊళ్లో దేవుడి గుళ్ళలో పూజలు చేసే పురోహితులు చాలా మంది శ్రాద్ధ కర్మలు చెయ్యడం మానేశారు...ఎందుకంటే అది హిందూ మత పరంగా వస్తున్న ఆచారం..నిషేధంట. ఇక వృత్తిగా పౌరోహిత్యం చేస్తున్న వారిలో తల్లి దండ్రులు బ్రతికి ఉన్న పూజారులు ఈ కర్మ కాండ చెయ్యకూడదుట. ఆ మాట కొస్తే దేవుడి పూజలు, వ్రతాలూ చేసే పూజారులు శ్రాద్ధ కర్మలు చేసే వాళ్ళు వేరు వేరు. అంచేత ఈ శ్మశాన వీరుడు రోజూ అదే పనిలో ఉంటాడు కాబట్టి ఆ ఇబ్బందిని వివరించి "మా హిందూ మతం పద్దతులలో దహన కర్మలు చేసే పూజారి ఎవరైనా మీ ఉద్యోగస్తులలో ఉన్నారా?" అని అడిగాం. దానికి వాడు అమాయకంగా "దానికి వేరే మనిషి ఎందుకు. వీడియోలు లేవా?" అన్నాడు.

మన వాళ్ళు వినాయక చవితులు, వ్రతాలూ, కొండొకచో పెళ్ళిళ్ళు కూడా వీడియోలు చూస్తూ చేసుకుంటున్నారని వింటున్నాం కదా.. విడియో పెళ్లి లాగానే విడియో శ్రాద్ధం పెట్టవచ్చుమో? అలాంటి శ్రాద్ధం వీడియోలు కూడా ఉన్నాయేమో మాలో ఎవరికీ తెలియదు.

మొత్తానికి వాళ్ళు ఇచ్చిన సమాచారం అంతా పుచ్చుకుని ఇంటికి వచ్చి ఎదురుగుండా బల్ల మీద పడేసి "హమ్మయ్య" అనుకుంటూ ఉండగా అప్పుడే ఉద్యోగం నుంచి తిరిగి వచ్చి ఆ రంగు రంగుల శ్మశానం ఫోటోలు, ఇన్స్యూరెన్స్ పత్రాలు చూడగానే మా క్వీన్ విక్టోరియా మొహం పాలిపోయింది. "ఏమిటిదంతా?" అని హుంకరించగానే నేను HATS గురించీ, అందులో ఆ రోజు ఈ విషయం మీద సమావేశం గురించీ చెప్పగానే "మతి లేక పోతే సరి. నిన్న పుట్టిన రోజు పెట్టుకుని ఇవాళ శ్మశానం వివరాలు కనుక్కొస్తావా? ఎప్పుడూ వెళ్ళని వాడివి ఆ

ముసలి మీటింగ్ కి ఇప్పుడే వెళ్ళాలా? అయినా నువ్వు వెళ్ళగానే ఇలాంటి మీటింగ్ సబ్జెక్ట్ మీద వాళ్ళు మీటింగ్ పెట్టడం ఏమిటీ? వెళ్ళే ముందు నాతో చెప్పక్కర్లేదూ? ఏం అంత తొందరా?" ఇలా అడ్డమైన చివాట్లూ వేసింది మా ఆవిడ.

ఆ సమయం లో నా సందిగ్దావస్తని ఆవిడతో చెప్పుకునే అవకాశం బొత్తిగా లేదు. ఇంతకీ ఇప్పుడు వాడు వారం రోజులలో కొనుక్కున్న వాళ్లకి ఇచ్చే భారీ తగ్గింపు ధరలో నేను ఆ దహన బీమా కొనుక్కోవాలా వద్దా? వచ్చే నెల జరిగే ఈ టోపీల వారి సమావేశానికి వెళ్ళాలా వద్దా? అదే నా సందిగ్ధావస్థ!

**COMMENTS**